సాక్షి ప్రకాశం

బుధవారం । 17 । జనవరి । 2024



రైతు శ్రేయస్సే జగనన్న ధ్యేయం

రైతు శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో..



వైభవంగా వల్లూరమ్మతల్లి తెప్పోత్సవం

వల్లూరమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వల్లూరు చెరువులో అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా సాగింది - 8లో..

గరిష్టం/కనిష్టం
31/22

వాతావరణం

ఉదయం పొగమంచు ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లనిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తిరుగు ప్రయాణానికి ప్రత్యేక బస్సులు

- జిల్లా వ్యాప్తంగా 86 బస్సులు సిద్ధం

ఒంగోలు: సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. మంగళ, బుధ, గురు వారాల్లో మొత్తం 86 బస్సులను నడపాలని నిర్ణయించింది. మంగళవారం 33 , బుధవారం 46, గురువారం 7 సర్వీసులను అందుబాటులో ఉంచింది. గిద్దలూరు డిపో నుంచి 13, కనిగిరి డిపో నుంచి 15, మార్కాపురం డిపో నుంచి 12, ఒంగోలు డిపో నుంచి 32, పొదిలి డిపో నుంచి 14 సర్వీసులు సిద్ధం చేశారు. ఈ సర్వీసులు వేటికి అదనపు చార్జీ వసూలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో బస్టాండ్లలో మరలా రద్దీ పెరిగింది. వీకెండ్ కాకపోవడంతో తిరిగి తమ తమ విధుల్లో చేరేందుకు ప్రయాణికులు ఆసక్తిచూపుతుండడంతో అందుకు తగ్గట్లుగా బస్సులను నడుపుతున్నారు.

రేపు సామాజిక సమత సంకల్పం

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు హెచ్‌సీఎం కేంద్రంలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎస్ లక్ష్మనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తర్వాత హెచ్‌సీఎం సెంటర్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ వరకు మారథాన్, మానవహారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట




గ్రామస్తులతో ఓఎస్‌డీ చంద్రశేఖర్‌రెడ్డి

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందని ప్రభుత్వ వ్యవసాయ మిషన్ ఓఎస్‌డీ ఎం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం ఆయన సొంత గ్రామమైన ఉమ్మడివరానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని అందరితో మాట్లాడి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, సచివాలయ వ్యవస్థ పని తీరు, వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, ఆరోగ్యంతో పాటు వ్యవసాయ శాఖకు పెద్దపీట వేసిందన్నారు. వ్యవసాయ శాఖలో నూతన సంస్కరణలతో మన రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందన్నారు. గ్రామస్తులు వెంకట్రామిరెడ్డి, వెంకిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రవికోటిరెడ్డి, తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

కకావికలం

జిల్లా టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు, క్యాడర్ పార్టీకి దూరం కావడంతో ఆ పార్టీ కకావికలమైంది. ఈ పరిణామాలతో టీడీపీ అధిష్టానం అభ్యర్థుల ప్రకటనపై ఏ నిర్ణయం తీసుకోలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లాలో ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేదు. ఎవరికి వారే యమునా తీరే చందంగా వ్యవహరిస్తుండడంతో పార్టీ కార్యకర్తల్లో సైతం నిస్తేజం నెలకొంది. మరో వైపు అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థుల మార్పులు, అభ్యర్థిత్వాలపై నిర్ణయాలను చకాచకా చేసుకుంటూ పోతోంది. ప్రధాన ప్రతిపక్షంగా చెప్పుకునే టీడీపీ మాత్రం పార్టీ నేతల మధ్య సమన్వయం తీసుకురాలేక గిలగిల కొట్టుకుంటోంది.

- అధిష్టానం అయోమయం.. క్యాడర్ నిస్తేజం
- జిల్లాలో ఏ ఒక్క సీటునూ ప్రకటించని అధిష్టానం
- దామచర్ల బ్రదర్స్ మధ్య అంతర్యుద్ధం
- కొండపిలో గ్రూపుల గోల
- దర్శికి నాథుడే లేడు..
- కనిగిరిలో ఎన్నికల శంఖారావ సభ అట్టర్‌ప్లాప్‌తో టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం
- గిద్దలూరు తమకేనంటూ జనసేన నేత ప్రకటనతో గందరగోళం




సాక్షి ప్రతినిధి, ఒంగోలు

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు పట్టుమని నెల రోజులు కూడా లేదు. ఎలక్షన్ ఫీవర్ మొదలు కావడంతో వైఎస్సార్ సీపీలో ఉత్సాహం ఉరకలేస్తుంటే.. టీడీపీ క్యాడర్‌లో మాత్రం నైరాశ్యం రాజ్యమేలుతోంది. క్షేత్రస్థాయిలో టీడీపీ పూర్తిగా చతికిలపడి పోయింది. ఈ పరిస్థితుల్లో మాజీలను అభ్యర్థులుగా నియమించేందుకు సాహసించలేక.. ప్రత్యామ్నాయ నేతల వైపు చూస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ సీపీ సామాజిక వర్గాలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులను ప్రకటిస్తున్న నేపథ్యంలో టీడీపీ దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటుంది. పార్టీ పరిస్థితి ఇలా ఉంటే.. లీడర్ల వ్యవహారం ఆ పార్టీకి తలబొప్పి కట్టిస్తోంది. జిల్లా కేంద్రం ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ తీరుపై పార్టీ కేడర్‌లో పూర్తి స్థాయిలో అసంతృప్తి నెలకొంది. చంద్రబాబు సామాజిక వర్గ నాయకులకు మినహా పార్టీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులకు ప్రాధాన్యం లేదని ఆయా సామాజిక వర్గాలకు చెందిన నాయకుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. జిల్లాలోని రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థుల కొరత టీడీపీని తీవ్రంగా కలచి వేస్తోంది. ఒంగోలులో దామచర్ల జనార్దన్, ఆయన సోదరుడు దామచర్ల సత్య మధ్య మనస్పర్థలు తీవ్రస్థాయికి చేరాయి. జనార్దన్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీకి మధ్య కూడా ఎడముఖం.. పెడ ముఖం అన్నట్లుగా ఉన్నారు. బాలాజీ బీసీ సామాజిక వర్గం యాదవ కులానికి చెందిన నేత కావడంతో జనార్దన్ ప్రాధాన్యత లేకుండా పూర్తిగా వదిలేశారు. ఒంగోలు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో మినహా జిల్లాలోని మిగతా నియోజకవర్గాలలో ఆ పార్టీకి దిశానిర్దేశం చేసే నాయకులే కరువయ్యారు.



ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం విషయానికి వస్తే మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒంటెత్తు పోకడ ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టింది. జిల్లా కేంద్రం ఒంగోలులో జనార్దన్ ఏర్పాటు చేసుకున్న కార్యాలయం కేంద్రంగానే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ ప్రత్యేకంగా మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆ కార్యాలయానికి ఎవరినీ వెళ్లనీయకుండా జనార్దన్ అడ్డుకుంటూ వస్తున్నారు. దీంతో వీరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. జనార్దన్‌కు ఆయన సోదరుడు దామచర్ల సత్యకు మధ్య కూడా తీవ్రస్థాయి మనస్పర్థలు రచ్చకెక్కాయి. అసలు జనార్దన్‌కు టిక్కెట్ ఇస్తే సహించేది లేదని సత్య భీష్మించుకు కూర్చున్నారు. ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో జనార్దన్ సామాజిక వర్గానికి చెందిన నాయకులే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



స్వామికి అసమ్మతి పోటు..

కొండపి నియోజకవర్గంలో టీడీపీకి చెందిన డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ఎమ్మెల్యేగా ఉన్నా చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన నాయకులదే పెత్తనం. దామచర్ల జనార్దన్‌ది కూడా కొండపి నియోజకవర్గంలోని టంగుటూరు మండలం. అయితే ఎమ్మెల్యే డోలాకు జనార్దన్ సోదరుడు దామచర్ల సత్య మద్దతు ఇస్తూ వచ్చారు. ఇటీవల వీరిద్దరి మధ్య కూడా విభేదాలు పొడచూపాయి. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు టీడీపీలో ఉన్నా దామచర్ల కుటుంబానికి, పోతుల కుటుంబానికి అనాధిగా వైరం ఉంది. దీంతో ఎమ్మెల్యేతో కూడా ఆయన దూరంగా ఉంటూ వస్తున్నారు. నియోజకవర్గంలో బలమైన కుటుంబంగా ఉన్న బెల్లం కోటయ్య కూడా ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ సారి ఎన్నికల్లో స్వామికి అసమ్మతి పోటు తప్పేలా లేదు.

దర్శికి దిక్కేలేదు..

దర్శి నియోజకవర్గంలో ఆ పార్టీ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అక్కడ కనీసం పార్టీకి ఇన్‌చార్జ్ కూడా లేడంటే ఆ పార్టీ పరిస్థితి ఎంతదయనీయంగా ఉందో అర్థమవుతోంది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో ఉన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా పమిడి రమేష్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అయోమయంగా మారడంతో ఆయన కూడా పార్టీ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. దర్శి నుంచి ప్రాధాన్యత లేకపోయేసరికి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కూడా నియోజకవర్గంలోని ఒక గ్రామం మీదుగా అద్దంకి నియోజకవర్గానికి వెళ్లిపోయింది.

ఉగ్రకు అంతర్గత పోరు

కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అనుకున్నంత ఆశాజనకంగా లేదు. పార్టీలో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లోపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పాత టీడీపీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు, పట్టించుకోవడం లేదనే విమర్శలు ఆ పార్టీలో బలంగా ఉన్నాయి. కొత్త టీడీపీ(ఉగ్ర సేన పేరుతో) దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఉగ్ర నరసింహారెడ్డి కూడా వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో పాత, కొత్త నేతల మధ్య అంతర్గత పోరు నివురు గప్పిన నిప్పులా మారింది. ఇటీవల జరిగిన ఓ తిరునాళ్లలో, టీడీపీ చేపట్టిన బస్సు యాత్రలో అసంతృప్తులు కొంత బయట పడినా .. పార్టీ జిల్లా అధిష్టానం జోక్యంతో సర్దుకున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న సీనియర్ నాయకులు ఉగ్రతీరుపై అసంతృప్తిలో రగులుతున్నారు. అతనికి టికెట్ ఇస్తే చాలా మంది పార్టీని వీడే అవకాశం ఉంది. అంతర్గత కుమ్ములాటలు ఇటీవల చంద్రబాబు నిర్వహించిన 'రా..కదలిరా' ఎన్నికల ప్రచార సభకు ఆశించిన మేరకు జనం రాలేదు. దీనిపై చంద్రబాబు అందరిపై సీరియస్ అయ్యారు. సభలో కనిగిరి అభ్యర్థిగా తన పేరు ప్రకటిస్తారు అని ఉగ్ర భావించారు. అయితే బాబు ఎక్కడా ఆయన పేరును ప్రస్తావించకపోవడంతో కంగుతిన్నారు. దీంతో ఈ దఫా ఉగ్రకు టికెట్ లేదంటూ ఆయన అసమ్మతి వర్గం జోరుగా ప్రచారం చేస్తోంది.



ఎవరిదారి వారిదే..

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఎవరిదారి వారిదే అన్న చందంగా తయారైంది టీడీపీ నేతల పరిస్థితి. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో నియోజకవర్గంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ మన్నె రవీంద్ర కీలక నేతగా చెప్పుకుంటున్నారు. ఆయన సిఫార్సుచేసిన వారికే టీడీపీ టికెట్ దక్కుతుందని ఆయన వర్గీయులు బాహాటంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నా ఇప్పటి వరకు పోటీచేసే అభ్యర్థి పేరు మాత్రం చెప్పలేక పోతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు పేరును చంద్రబాబు నాయుడు ప్రకటించినా అది తాత్కాలికమేనని, ఎన్నికల నాటికి కొత్త అభ్యర్థి ఖరారవుతాడని నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2014, 2019లలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యరిగా పోటీ చేసి ఓటమి పాలయిన బూదాల అజితారావు ఈ సారికూడా తనకే టిక్కెట్ వస్తుందని, తానే గెలుస్తానన్న ధీమాతో ఉన్నారు. నియోజకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ టీడీపీ గెలిచింది లేదు.

టీడీపీ– జనసేన మధ్య కానరాని సఖ్యత

నేతల మధ్య సఖ్యత కరువైంది. తమను టీడీపీ చిన్నచూపు చూస్తోందని జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఇరుపార్టీల మధ్య రెండు సార్లు సమన్వయ కమిటీల సమావేశాలు జరిగితే జనార్దన్ ఆలస్యంగా రావడం, మొక్కుబడిగా ప్రసంగించి వెళ్లిపోవడంపై కూడా వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ అయితే ఈ సమావేశాలకు హాజరుకాలేదు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనకు మద్దతు తెలిపే సమయంలో కూడా టీడీపీ నేతల ప్రకటనలపై జనసేన నేతలు విమర్శలు చేశారు.



కందులపై నేతల అసంతృప్తి..

మార్కాపురంలో టీడీపీ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డి నియోజకవర్గ టీడీపీ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఆయన తోడల్లుడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ డీపీ కృష్ణారెడ్డి, ప్రధాన అనుచరుడు ప్రముఖ పారిశ్రామికవేత్త వెన్న పోలిరెడ్డి ఇప్పటికే వైఎస్సార్ సీపీలో చేరారు. నారాయణరెడ్డికి ఇటీవల యర్రగొండపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఆయన నియోజకవర్గంలో అప్పుడప్పుడూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన తరుపున సోదరుడు మాజీ జెడ్పీటీసీ కందుల రామిరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో తిరుగుతున్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న మార్కాపురం, పొదిలి సీనియర్ నేతలు శాసనాల వీరబ్రహ్మం, పొదిలికి చెందిన గుడిపూడి భాస్కర్, ఠావణి వెంకటేశ్వర్లు, మార్కాపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కె. శ్రీనివాసులు యాదవ్ తదితరులు సైతం కందులపై తీవ్ర అసంతృప్తితో ఉంటూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్ వైశ్య సామాజికవర్గానికి చెందిన వక్కలగడ్డ మల్లికార్జున్ కూడా నారాయణరెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జనసేన తలపోటు..

గిద్దలూరు టీడీపీలో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలో నేతలు గ్రూపులుగా ఏర్పడి ఎవరి ప్రాబల్యం కోసం వారు పాకులాడుతున్నారు. పార్టీలో మాజీ ఎమ్మెల్యే పిడతల సాయి కల్పనారెడ్డి , పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిపై తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. చంద్రబాబు అరెస్ట్ కాకముందు గిద్దలూరులో చంద్రబాబు పర్యటన జరిగింది. ఆ సమయంలో ఆమెకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఇంటి మీద ఉన్న టీడీపీ జెండాను కూడా పీకేశారు. ప్రస్తుతం ఆమె పార్టీకి దూరంగా ఉన్నారు. ఇదిలా ఉండగా జనసేన తరుపున పోటీ చేస్తున్నానంటూ చీరాలకు చెందిన ఆమంచి స్వాములు ప్రకటించుకున్నారు. దీంతో టీడీపీ నేతలు అవాక్కయ్యారు. అంతా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

రెండు దశాబ్దాలుగా ఎగరని జెండా..

సంతనూతలపాడులో 20 సంవత్సరాల నుంచి టీడీపీ అభ్యర్థులు వరుసగా ఓటమి పాలవుతూనే ఉన్నారు. ఇటీవల నారా లోకేష్ చీమకుర్తికి పాదయాత్రకు వచ్చినప్పుడు కూడా 20 సంవత్సరాల నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 1999లో పాలపర్తి డేవిడ్‌రాజు గెలిచిన తర్వాత ఇంతవరకు టీడీపీ గెలిచింది లేదు. వరుసగా నాలుగుసార్లు టీడీపీ ఓటమిపాలైంది. 2004, 2009ల్లో వరుసగా వైఎస్సార్ ప్రభంజనంలో టీడీపీ కొట్టుకుపోయింది. ఆ తరువాత 2014, 2019లో జరిగిన రెండు ఎన్నికల్లో వరుసగా వైఎస్సార్ సీపీ విజయం సాధించింది. ఆ పార్టీ ఇన్‌చార్జ్ బీఎన్ విజయ కుమార్‌పై ఇప్పటికీ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. ఆ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ఎవరిదారి వారిదే అన్నచందంగా తయారైంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పౌరుషాలకు ప్రతీక ఎడ్ల పందేలు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సురేష్

మద్దిపూడి(సింగరాయకొండ): పౌరుషాలకు ప్రతీకగా ఎడ్ల పందేలు నిలుస్తాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మద్దిపూడి మండలం గుండ్లసముద్రంలో స్పేస్ విజన్ గ్రూప్ అధినేత తూమాటి వెంకట నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర ఎడ్ల బల ప్రదర్శన పోటీల ప్రారంభానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గోదావరి జిల్లాలో కోడి పందేలు నిర్వహిస్తుంటే, మన ప్రాంతంలో సంప్రదాయానికి ప్రతీకగా ఎడ్ల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎడ్ల పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించారని కొనియాడారు. ప్రతి ఇంట్లో అవినీతి రహితంగా, జవాబుదారీతనంతో, సమర్థవంతంగా సంక్షేమ ఫలాలను ఇచ్చారన్నారు. జగనన్న నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరని ప్రశంసించారు. వైఎస్సార్ సీపీ ప్రజల పార్టీ అని అందుకే ప్రజాసంక్షేమమే పరమావధిగా పాలన కొనసాగించి ప్రజల మన్ననలు పొందగలిగారన్నారు. ఐదేళ్ల క్రితం ప్రజలు తీసుకున్న నిర్ణయం వారి తలరాత మార్చిందని, మరొక్క సారి కూడా జగనన్నకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్దిపూడి మండలంలో తాగు, సాగునీటికి రూ.32 కోట్లు, పృథులగిరికి ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులకు సంబంధించి జీఓ విడుదల అయ్యేందుకు సహకరించి పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. సంగమేశ్వరం ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన కర్తవ్యమని మంత్రి సురేష్ ప్రజలకు వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, జంకె వెంకటరెడ్డి, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, దొనకొండ ఎంపీపీ ఉషా మురళీకృష్ణ, కంభం మాజీ ఎమ్మెలే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మాజీ పార్టీ అధ్యక్షుడు బోద రమణారెడ్డి, చిమట సొసైటీ అధ్యక్షుడు మాకినేని వెంకట్రావు, మద్దిపూడి సొసైటీ అధ్యక్షుడు ఆర్‌వీ భాస్కరరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా

బీచ్ కబడ్డీ



ఫ్లడ్‌లైట్ల వెలుగులో జాతీయ మహిళా బీచ్ కబడ్డీ పోటీలు



తలపడుతున్న వైజాగ్, ఇంకొల్లు జట్లు

ఒంగోలు రూరల్: సంక్రాంతి సందర్భంగా కరవదిలో జాతీయ మహిళా బీచ్ కబడ్డీ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. జాతీయ క్రీడాకారుడు సిరిగిరి రంగారావు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు హైదరాబాద్‌కు చెందిన డీఎస్పీ వేణుగోపాల్‌లు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు సభాధ్యక్షత వహించారు. పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కబడ్డీతో క్రీడాకారుల్లో క్రమశిక్షణ నేర్పడంతో పాటు శరీర సౌష్టవం పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది క్రీడాకారులు మరుగునపడిపోతున్నారని, వారిని వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విశాఖపట్నం, ఇంకొల్లు జట్లు తలపడ్డాయి. మాజీ కబడ్డీ క్రీడాకారుడు అంచిపోగు వెంకటేశ్వర్లు, సర్పంచ్ డి.కోటేశ్వరరావు, శిరిగిరి అంజయ్య, కొల్లూరి బాబురావు, గొలిమి శ్రీనివాసరావు, కుర్రా భాస్కర్‌రావు పాల్గొన్నారు.

నేత్రోత్సవం





ఒంగోలు మెట్రో: సంక్రాంతి వేడుకల్లో భాగంగా రంగారాయుడు చెరువులో తెప్పోత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా సాగింది. కేశవస్వామిపేటలోని చెన్నకేశవస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

క్లుప్తంగా

రాకాసి అలలకు ఒకరు బలి

● కనపర్తి సముద్ర తీరంలో ఘటన


కాళిదాసు(ఫైల్)

నాగులుప్పలపాడు: సముద్ర స్నానానికి వెళ్లిన వ్యక్తి అలల తాకిడికి గల్లంతై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కనపర్తి తీరప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన చీరాల కాళిదాసు(50) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా రాకాసి అలలు రావడంతో వాటి తాకిడికి తట్టుకోలేక సముద్రంలోకి కొట్టుకుపోయారు. కొంత సమయం తర్వాత కాళిదాసు అచేతన స్థితిలో బయటికి రావడంతో హుటాహుటిన ఒంగోలులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు అమ్మనబ్రోలు గ్రామ సచివాలయం-2 పరిధిలో వైఎస్సార్ సీపీ గృహసారథిగా పనిచేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

హనుమంతునిపాడు: పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన హనుమంతునిపాడు మండలం వేములపాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేములపాడు గ్రామానికి చెందిన కంపిని బాలకాశయ్య(35) తన పొలంలో వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా అవుతున్న తీగ కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న రైతులు సంఘటనా స్థలానికి వచ్చి చూడగా అప్పటికే బాలకాశయ్య విగతజీవిగా పడిఉన్నాడు. మృతుడికి వివాహం కాలేదు. తల్లి చెన్నమ్మ, ఒక తమ్ముడు, నలుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. తండ్రి లేని ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటున్న బాలకాశయ్య అకాల మృతితో కుటుంబ సభ్యులు దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్నారు.

మానవ సంబంధాలు ముఖ్యం

● హైకోర్టు జస్టిస్ మన్మధరావు


మాట్లాడుతున్న జస్టిస్ మన్మధరావు

సింగరాయకొండ: నేటి సమాజంలో క్రమంగా కనుమరుగవుతున్న మానవ సంబంధాలను పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైకోర్టు జస్టిస్ కె.మన్మధరావు పేర్కొన్నారు. కనుమ పండుగను పురస్కరించుకుని సింగరాయకొండ మండలంలోని బింగినపల్లిలో గ్రామ అభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ముగ్గుల పోటీలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జస్టిస్ కె.మన్మధరావు మాట్లాడుతూ.. పండగ సందర్భంగా స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. యువత సెల్‌ఫోన్‌పై అధికంగా ఆధారపడటం మంచిది కాదని, చిన్నారులకు సైతం ఫోన్ చూపి ఆడిపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల్లో దాగిన కళాత్మకతను వెలికి తీయడానికి ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ నూకసాని సుబ్బారావు, సర్పంచ్ జెట్టి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి పార్వేట ఉత్సవం


ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: సంక్రాంతి సందర్భంగా మంగళవారం కనుమ పండగను పురస్కరించుకుని మార్కాపురంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పూల పల్లకిపై ఉంచి మోతుకాపరులు పార్వేట మండపానికి రాగా.. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పార్వేట ఉత్సవాన్ని కనులారా తిలకించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, కమిటీ చైర్మన్ కేశవరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా వల్లూరమ్మతల్లి తెప్పోత్సవం


వల్లూరు చెరువులో వల్లూరమ్మ తల్లి తెప్పోత్సవం

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వల్లూరు చెరువులో అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా సాగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. మంత్రికి ఆలయ ఈఓ రమేష్, ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సర్పంచ్ వల్లూరి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు యలసిరి సత్యవాణి, నాయకులు కుందం హనుమారెడ్డి, సనగర కోటి, కుందం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

రైతు శ్రేయస్సే జగనన్న ధ్యేయం

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
● దర్శిలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు ప్రారంభం
● 226 ట్రాక్టర్లతో ఉత్సాహంగా పాల్గొన్న యజమానులు, డ్రైవర్లు

దర్శి: రైతుల్లో ఉత్సాహం నింపాలనే ముఖ్య ఉద్దేశంతో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో సోమవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలను వారు ప్రారంభించారు. శివప్రసాద్‌రెడ్డి


ట్రాక్టర్ రివర్స్‌లో నడిపి కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు

ట్రాక్టర్‌ను రివర్స్‌లో నడిపి పోటీదారులను, పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలన్నీ అక్కడే అందిస్తున్నారని చెప్పారు. గతంలో ఎరువులు, ఇతరత్రా అవసరాలకు ట్రాక్టర్‌లు తీసుకుని మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రూపాయి ఖర్చు లేకుండా నష్ట పోయిన రైతులకు బీమా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు.

ట్రాక్టర్ రివర్స్ పోటీల్లో 226 మంది పాల్గొనగా.. మొదటి బహుమతి రూ.30 వేలు తానంచింతలకు చెందిన మేకల చిన్న ఆదినారాయణ, ద్వితీయ బహుమతి రూ.25 వేలను లక్ష్మీపురానికి చెందిన కుందురు రవీంద్రారెడ్డి, తృతీయ బహుమతి రూ.20 వేలను రాజంపల్లికి చెందిన అమరా వెంకట్రావు, నాలుగో బహుమతి రూ.15 వేలను చలివేంద్రకు చెందిన డి.రాజేష్, ఐదో బహుమతి రూ.10 వేలను వెంకటాచలంపల్లెకు చెందిన పాణెం నారాయణరెడ్డి గెలుపొందారు.

కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ సుధా అచ్చయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూధన్‌రెడ్డి, ఇత్తడి దేవదానం, ఏఎంసీ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా బీభత్సం

● ముగ్గురు యువకులను గాయపరిచిన దుండగులు
● హాజీపురం అడ్డరోడ్డులో ఘటన

హనుమంతునిపాడు: బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులను దారి దోపిడీ ముఠా అటకాయించి సొమ్ము కాజేయడంతోపాటు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన హనుమంతునిపాడు మండలం హాజీపురం అడ్డరోడ్డు సమీపంలో గుడిపాటిపల్లి-కనిగిరి మార్గంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..కిష్టంపల్లి పంచాయతీ తక్కెళ్లపాడు హరిజనవాడకు చెందిన కోలా దేవదాసు, కుదారి చెన్నరాయుడు, కుదారి చంద్ర బైక్‌పై కనిగిరి నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. హాజీపురం అడ్డరోడ్డు దాటి గుడిపాటిపల్లి మార్గంలో వెళ్తున్న సమయంలో వెంగనిగుండ్ల కుంట సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు చేతిలో కర్రలు పట్టుకుని బైక్‌ను అటకాయించారు. ముగ్గురు యువకులపై కర్రలతో దాడి చేసి, వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు తీసుకుని పారిపోయారు. గాయపడిన


హాజీపురం అడ్డరోడ్డు సమీపంలో తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

యువకులు కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో చేరారు. హనుమంతునిపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం క్రైమ్ ఏఎస్పీ శ్రీధర్‌బాబు, డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందం ముమ్మరంగా గాలించింది. సంఘటనా స్థలాన్ని కనిగిరి సీఐ శిరామకృష్ణారెడ్డి, కనిగిరి, హనుమంతునిపాడు, సీఎస్‌పురం ఎస్సైలు శినాగరాజు, మాధవరావు, నాగేశ్వరావు పరిశీలించారు. నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు చెప్పారు.

నాలుగు పూరిళ్లు అగ్నికి ఆహుతి


అగ్నిప్రమాదంలో కాలిపోయిన పూరిళ్లు

● ఓ ఇంట్లో వంట చేస్తుండగా చెలరేగిన మంటలు
● త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలో ఘటన
● బాధితులకు వైఎస్సార్ సీపీ నేతల సాయం

త్రిపురాంతకం: వంట చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన త్రిపురాంతకం మండలం లేళ్లపల్లి ఎస్టీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. ఎస్టీ కాలనీలో నివసిస్తున్న చేవూరి గురవమ్మ ఇంట్లో గ్యాస్ పొయ్యిపై వంట చేస్తున్న సమయంలో ఒక్కసారిగి మంటలు ఎగసిపడి చూరుకు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు స్పందించి మంటలు ఆర్పేలోగా పక్కనే ఉన్న దూదేకుల కాశింబి, దూదేకుల సిద్దమ్మ, దూదేకుల నాసరమ్మకు చెందిన పూరిళ్లకు అగ్నికీలలు వ్యాపించాయి. కాలనీవాసుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇళ్లన్నీ పూర్తిగా బుగ్గి కావడంతో ఆ


బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి

నాలుగు కుటుంబాలకు చెందిన వారు కట్టుబట్టలతో మిగిలిపోయారు. వీరంతా స్థానికంగా కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నారు. పండగ పూట అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ నేతలు చేయూతనందించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.3 వేల నగదు అందించారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి అందజేశారు. మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు అందించి దాతృత్వం చాటుకున్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు జై భీమ్‌లు

● ఫిబ్రవరి 10న ఒంగోలులో అంబేడ్కర్ వాదుల మహాసభ
● దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు

ఒంగోలు: భరత జాతి గర్వించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈ నెల 19న విజయవాడ నగర నడిబొడ్డున ఆవిష్కరించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత సంఘాల ఐక్యవేదిక తరఫున జైభీమ్‌లు ప్రకటిస్తున్నామని ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అమృత హాస్పిటల్ ఎదురుగా ఉన్న దళిత సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో డప్పు చర్మ కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులుమాదిగ, దళిత నాయకులు దండేల కృష్ణ, తేళ్ల దిలీప్, కందుల శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఫిబ్రవరి 10న ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న అంబేడ్కర్ వాదుల మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ.. మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ హాజరవుతున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అంబేడ్కర్ కలలు సాకారం చేసేందుకు, అంబేడ్కర్ వాదులను గెలిపించేందుకు ఐక్యవేదిక భాగస్వామ్య సభ్యులతో చర్చ నిర్వహిస్తున్నామన్నారు. అంబేడ్కర్ వాదులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


అంబేడ్కర్ వాదుల మహాసభ కరపత్రం ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

చెంచుల ఉన్నతికి పీఎం జన్‌మన్


ఉజ్వల్ యోజన కింద చెంచు మహిళకు గ్యాస్ స్టౌ అందజేస్తున్న అధికారులు

● మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

యర్రగొండపాలెం: అర్హత కలిగిన ప్రతి చెంచు గరిజన కుటుంబానికి పీఎం జన్‌మన్ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా సోమవారం పీఎం నరేంద్ర మోదీ చెంచు గిరిజనులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్థానిక మినీ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని 7 మండలాల పరిధిలో ఉన్న 88 ఆవాస ప్రాంతాల నుంచి దాదాపు 500 మంది చెంచు గిరిజనులు పీఎం సందేశాన్ని విన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ గిరిజనులను ఉద్దేశించి మాట్లాడారు. పీఎం జన్ మన్ పథకం కింద 11 పథకాలను చెంచు గిరిజనులకు అందించనున్నామని చెప్పారు. చెంచులు నివసించే గిరిజన గూడేల్లో 54 క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖలోని కంపెనీ సెక్రటరీలు, క్యాంపు పరిశీలకులు ఎస్.హెచ్.కుంజు బిహారి, కె.బి.ముద్గల్ మాట్లాడుతూ.. జన్ మన్ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారని, పండగ వేళ కూడా పెద్ద సంఖ్యలో చెంచు గిరిజనులు కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్హులైన చెంచు కుటుంబాలకు హౌసింగ్, ఆయుష్మాన్ భారత్ పతకాల పత్రాలు, ఉజ్వల్ యోజన గ్యాస్ స్టౌలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఐటీడీఏ రాష్ట్ర అధికారి మధుసూదనరావు, జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పేరయ్య, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, డీవైఎంహెచ్‌వోలు రాహుల్, ఎం.శ్రీనవాసరావు, డీఎల్‌డీవో బి.వి.ఎన్.సాయికుమార్, పీఆర్ డీఈ బి.సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో బి.పద్మావతి, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏపీవో నాగేశ్వరరావు, 7 మండలాల తహసీల్దార్లు ఎంపీడీవోలు, సర్పంచ్‌లు, చెంచు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పీఎం జన్ జాతి ఆదివాసీ కార్యక్రమంలో పాల్గొన్న చెంచు గిరిజనులు

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేత మద్దిపాడు జట్టు


విజేతగా నిలిచిన మద్దిపాడు జట్టుకు కప్ అందిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నేతలు

మద్దిపాడు: సంక్రాంతి సందర్భంగా మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో వాకా కోటిరెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 13వ ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో మద్దిపాడు మణి ఫ్రెండ్స్ జట్టు విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.50,116ను వైఎస్సార్ సీపీ మండల నాయకుడు పోతినేని శ్రీనివాసరావు ప్రకటించగా ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి చేతులమీదుగా అందించారు. రన్నరప్‌గా నిలిచిన ఇనమనమెళ్లూరు జైభీమ్ లయన్స్ జట్టుకు రూ.25,116ను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావు అండ్ ఫ్రెండ్స్ అందించారు. మూడో స్థానంలో నిలిచిన ఒంగోలు యువ లెవన్స్ జట్టుకు రూ.15116ను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు లింగా రామచంద్రారెడ్డి అందజేశారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన గద్దె జాలయ్య, కమిటీ సభ్యులు వై.ప్రవీణ్, పి.వసంత్, బి.వినోద్‌ను ఎంపీపీ అభినందించారు. వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ యాదాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.